
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



63.210 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 62.210 టీఎంసీలు ఉన్నాయి. 275 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 1,920, ఉత్తరకాలువకు 620, దక్షిణ కాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,170
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,196
3 శాతం జీఎస్టీతో	రూ.5,352
నవర (8 గ్రా)	రూ.42,816

గరిష్టం/కనిష్టం
34.4 /23.0

వాతావరణం

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు ముందుగానే వేసవిని తలపిస్తున్నాయి. గడిచిన రెండు రోజుల్లో 3 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రతలు పెరిగాయి. గాలిలో తేమ 57 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ట్రైయినీ కలెక్టర్ తనిఖీ



సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి

నెల్లూరు(అర్బన్): జిల్లా పౌర సరఫరాల సంస్థ (సివిల్ సప్లయీస్ కార్పొరేషన్)లో ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి బుధవారం తనిఖీలు చేశారు. ప్రభుత్వం అన్ని శాఖల పనితీరును పరిశీలించి నివేదికలు తెప్పించుకుంటుంది. అందులో భాగంగా ఆమె సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌కు వచ్చారు. ఆ సంస్థ డీఎం టి.వెంకటేశ్వర్లు పౌరసరఫరాల సంస్థ పనితీరు గురించి ఆమెకు వివరించారు. అనంతరం అక్కడి రికార్డులు, నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతుల ఖాతాల్లో నగదు జమ తదితర అంశాలపై డీఎంను అడిగి తెలుసుకున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ బాధ్యతలు పీహెచ్‌సీలకే



కొడవలూరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొడవలూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మార్చి 1వ తేదీ నుంచి పీహెచ్‌సీ డాక్టర్లే పూర్తిస్థాయిలో నిర్వహించాల్సి ఉందని డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం బాధ్యతలు 104 వైద్య బృందం నిర్వహిస్తున్నారన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపు వాహనాల పట్టివేత



స్టేషన్ ఆవరణలో పట్టుబడిన వాహనాలు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు శివారుల్లో రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న పలు వాహనాలను స్థానిక పోలీసులు వీఆర్వో ఫిర్యాదు మేరకు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై బాలమహేంద్రనాయక్ సమాచారం మేరకు.. విరువూరు గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని వీఆర్వో, గ్రామస్తులు తనకు బుధవారం తెల్లవారుజామున సమాచారం అందించారన్నారు. తన సిబ్బందితో వెళ్లి ఒక జేసీబీ, ఐదు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3,938 మంది విద్యార్థులకు గాను 551 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సూళ్లూరుపేటలోని ప్రతిభడిగ్రీ కళాశాలలో ముగ్గురు, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు కృష్ణచైతన్య, శ్రీవెంకటేశ్వర, విడవలూరులోని పీఆర్‌ఆర్‌అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒక్కొక్కరు డిబార్ అయినట్లు వివరించారు.



ప్రజలే ప్రభువులుగా పాలకులు, అధికార యంత్రాంగం భావిస్తోంది. నగరపాలక సంస్థ ద్వారా పౌరులకు అందాల్సిన సేవల్లో లోపాలు, జాప్యం లేకుండా క్షణాల్లో అందించేందుకు సాంకేతిక వేదికలను సద్వినియోగం చేసుకుంటుంది. పలు సోషల్ మీడియాల్లో నగరపాలక సంస్థ పేరుతో ఖాతాలు తెరిచి నేరుగా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను ఆహ్వానిస్తోంది. ప్రధానంగా పారిశుధ్యంపై వచ్చిన ఫిర్యాదులను క్షణాల్లోనే కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా శానిటరీ ఉద్యోగులకు తెలియజేసి పరిష్కారానికి చొరవ చూపుతోంది.



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

హైటెక్ కార్పొరేషన్

- సోషల్ మీడియాలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో ఖాతా పేజీలు
- వీటి వేదికగా పారిశుధ్యంపై పౌరుల ఫిర్యాదులు
- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా శానిటరీ ఉద్యోగులకు సూచనలు
- గంటల వ్యవధిలోనే సమస్యలకు సులువుగా పరిష్కారం
- కార్మికుల హాజరు, చెత్త సేకరణపై ఎప్పటికప్పుడు సమాచారం

నెల్లూరు సిటీ: నెల్లూరు నగర పాలక సంస్థ పౌర సేవలకు సాంకేతికత వైపు అడుగులు వేసింది. ప్రధానంగా నగర ప్రజలను ప్రభావితం చేసేది 'పారిశుధ్యం'. ప్రతి రోజు నగరం మొత్తాన్ని శుభ్రపరిచారా లేదా అనేది పరిశీలించడం కమిషనర్, ఇతర ఉన్నతాధికారులకు సాధ్యం కానిది. శానిటరీ సిబ్బంది ఇచ్చిన నివేదిక ప్రామాణికంగా తీసుకునే పరిస్థితి ఉండేది. కొంత మంది శానిటరీ ఉద్యోగులు, కార్మికుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని చోట్ల చెత్త సేకరణ జరగని పరిస్థితి. అయితే అక్కడక్కడ ఆగిపోయిన చెత్త సేకరణపై మీడియాల్లో కథనాలు కూడా వచ్చేవి. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకు నగరపాలక సంస్థ హైటెక్ పాలన వైపు అడుగులు వేసింది. పారిశుధ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో 21 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. నిత్యం నగరంలో పారిశుధ్య విభాగ సిబ్బందికి సూచనలు ఇస్తుంటారు. ఎక్కడ నుంచైనా సమస్యలు, ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 1 గంట వరకు, 2.30 నుంచి 5.30 వరకు విధులు నిర్వహిస్తుంటారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ గ్రూపుల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను పోస్ట్ చేసిన దృశ్యం

చెత్త సేకరణపై నిత్యం పర్యవేక్షణ

కార్పొరేషన్ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 8 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. 167 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక శానిటరీ కార్యదర్శిని నియమించారు. వీరితో పాటు 20 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఆయా డివిజన్లలో తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా ప్రతి నివాసానికి బుట్టలు అందజేశారు. ప్రతి నిత్యం వాహనాల ద్వారా చెత్త సేకరణకు శ్రీకారం చుట్టింది. ఆయా డివిజన్లకు కేటాయించిన పారిశుధ్య సిబ్బంది నిత్యం తమ పరిధిలో రోడ్లపై చెత్తను శుభ్రపరిచి ఈ వాహనాల ద్వారా తరలిస్తున్నారు. ప్రతి రోజూ తమ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులకు సంబంధించి ఫొటోలను టెలీగ్రామ్, వాట్సాప్ ద్వారా సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పంపిస్తున్నారు. కార్మికుల హాజరు, ఇంటింటా చెత్త సేకరణకు సంబంధించి ఫొటోలను సైతం పంపిస్తారు. ఎవరైనా ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి వివరాలను ఎంహెచ్‌ఓ వెంకటరమణ, కమిషనర్ హరితకు సమాచారం ఇస్తుంటారు. దీంతో పారిశుధ్య పనులు మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

కాలం మారింది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందాం. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ మనిషి జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ప్రజలు ప్రతి క్షణం సోషల్ మీడియాను ఫాలో అవుతున్నారు. ఈ అవకాశాన్ని నగర పాలక సంస్థ సద్వినియోగం చేసుకుంటోంది. పారిశుధ్య పనుల్లో జాప్యం, చెత్త సేకరణలో నిర్లక్ష్యం, సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదుల సేకరణకు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంది. ఆయా సైట్లలో నెల్లూరు నగరపాలక సంస్థ పేరుతో ఖాతాలు తెరిచి ఫిర్యాదులను ఆహ్వానిస్తోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లతో అకౌంట్లు మెయింటెయిన్ చేస్తోంది. ఈ ఖాతాలన్నీ కమాండ్ కంట్రోల్ విభాగంతో పాటు ఉన్నతాధికారులు పరిశీలిస్తుంటారు.

ట్యాగ్ చేసిన సమస్యలకు తక్షణమే పరిష్కారం

కార్పొరేషన్ పరిధిలో తమ ప్రాంతాల్లో సమస్యలను ఎవరైనా ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లకు ట్యాగ్ చేస్తే సోషల్ మీడియాను పర్యవేక్షిస్తున్న బృందం ఆయా సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. చిన్నపాటి సమస్యలు అయితే గంటల వ్యవధిలో పరిష్కారానికి చొరవ చూపిస్తున్నారు. ఇతర సమస్యలైతే 24 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలోని కార్పొరేషన్ సైట్లకు రోజురోజుకు ఫాలోవర్స్ పెరుగుతున్నారు.

ప్రతి నెలా 30 నుంచి 40 ఫిర్యాదులు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ ఖాతాలకు ప్రజల నుంచి నగరంలోని సమస్యలను ట్యాగ్ చేయడం, మెసెంజర్‌లో పోస్ట్ చేస్తున్నారు. దాదాపు ప్రతి నెలా 40 వరకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ పోస్టులను కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది స్థానిక శానిటరీ ఉద్యోగులకు పంపించి సమస్యలను పరిష్కరించి తిరిగి వారికి పరిష్కరించిన ఫొటోలను ఫిర్యాదుదారులకు ట్యాగ్ చేస్తున్నారు. దీంతో సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలకు సులువైన పద్ధతిలో సేవలు అందించేందుకు ఉపయోగపడుతోంది.

నగర పాలక సంస్థ నడుపుతున్న సోషల్ మీడియా పేజీలు

ఫేస్‌బుక్	నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్
ట్విట్టర్	ఎంసీనెల్లూర్4యు
ఇన్‌స్టాగ్రామ్	స్వచ్ఛ్‌ఎన్‌ఎంసీ
యూట్యూబ్ చానల్	నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్


RG
@RajeshGundala7
Replying to @MCNellore4U
@MCNellore4U ,Thank You Team ... You guys are taking NMC to new levels. Addressing the issues posted via Social Media and also making sure to close the issue.. Great Job Team .. @ysjagan , @AudimulapSuresh

ట్విట్టర్‌లో సమస్యలు పరిష్కరించడంతో ప్రజల నుంచి స్పందన

ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం



పారిశుధ్యం మరింత మెరుగుపరిచేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరణ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించగలుగుతున్నాం. ఎక్కడైనా సమస్యలను సోషల్ మీడియా ద్వారా తమ దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తున్నాం. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా డివిజన్లలో పనిచేసే శానిటరీ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్నాం.
– వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

కార్పొరేషన్ ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలను ఫాలో అవుతా



నగర పాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనులు, లేదా సమస్యలపై ఎప్పటికప్పుడు నెల్లూరు కార్పొరేషన్ ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాల్లో పోస్టులు పెడుతుంటాను. చాలా కాలంగా నేను అనేక సమస్యలపై పోస్టు చేయగానే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పరిష్కరిస్తున్నారు.
– ప్రసన్నకుమార్‌రెడ్డి, అల్లీపురం

గతంతో పోలిస్తే పారిశుధ్యం మెరుగు



గతంలో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం ప్రతి రోజు ఇంటింటా చెత్తసేకరణ నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులు సైతం క్లీన్‌గా ఉంటున్నాయి. ప్రజలు సోషల్ మీడియాలో సమస్యలపై పోస్టులు పెడుతున్నందున అధికారులు కూడా స్పందిస్తున్నారు.
– హరిబాబు, బాలాజీనగర్

అట్టహాసంగా మేరిగ నామినేషన్



వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంత్రి, ఎంపీలతో కలిసి నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి, జేసీ కూర్మనాథ్‌కు అందజేస్తున్న మేరిగ మురళి

- మంత్రి కాకాణి, ఎంపీలు, ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ హాజరు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి రెండు నామినేషన్లు

నెల్లూరు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేరిగ మురళి నామినేషన్ వేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి మురళి కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మేరిగ మురళి కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి, జేసీ కూర్మనాథ్ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.

పెళ్లకూరు మండలం బంగారంపేట సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను జేసీ కూర్మనాథ్‌కు అందజేశారు.

నేటితో ముగియనున్న గడువు


స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల గడువు గురువారంతో ముగియనుంది. శుక్రవారం నామినేషన్లు స్క్రూటిని చేస్తారు. ఈ నెల 27 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చి అనంతరం పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తారు.

నామినేషన్లతో సందడే సందడి

- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు
- కిటకిటలాడిన చిత్తూరు కలెక్టరేట్
- బుధవారం పట్టభద్రులకు 15, టీచర్‌కు 6 నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పక్కన మంత్రులు



నామినేషన్ దాఖలు చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ప్రతిపాదితలు

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. గడువు సమయానికి ముందే లోనికి ప్రవేశించిన అభ్యర్థుల నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్లు స్వీకరించారు.

అట్టహాసంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులుగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలం సురేశ్, ఆర్‌కేరోజా, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్, ఎంఎస్ బాబు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, కళ్యాణ్‌చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోటెత్తిన నామినేషన్లు

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం నామినేషన్లు అధిక సంఖ్యలో నమోదయ్యారు. కలెక్టరేట్ అధికారుల వివరాల మేరకు బుధవారం పట్టభద్రులకు 15, టీచర్‌కు 6 మంది నామినేషన్‌లు దాఖలు చేశారని అధికారులు వెల్లడించారు. నామినేషన్లను దాఖలు చేసేందుకు ఈ నెల 23 ఆఖరి తేదీ. ఈ నెల 16వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. బుధవారం వరకు పట్టభద్రులకు 23, టీచర్‌లకు 7 మంది నామినేషన్లను దాఖలు చేశారు.

ఎస్పీఎల్ విజేతలు సీఆర్ రెడ్డి, ఎన్ఆర్ఐ

- ముగిసిన రీజనల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి, జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ విజయం
- నేటి నుంచి విజ్ఞాన్స్‌లో రాష్ట్రస్థాయి మ్యాచ్‌లు




రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా గౌరిశంకర్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ గోపి చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న విన్నర్స్ ఎన్నారై జూనియర్ కళాశాల, విజయవాడ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రేవంత్, 50 పరుగులు

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ముగిశాయి. మొత్తం మూడు మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. బహుమతి ప్రదానోత్సవంలో విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.గౌరి శంకర్‌రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచ్ మేనేజర్ టి.గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. క్రీడల ద్వారా ఎంతో మంది ఉన్నత స్థానాలకు వెళ్లి దేశ ప్రతిష్టను పెంచారని గుర్తు చేశారు.

నాకౌట్ మ్యాచ్‌లో సర్‌సీఆర్‌రెడ్డి విజయదుందుభి



ట్రోఫీని అందుకుంటున్న రన్నర్స్ జూనియర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

జూనియర్స్ విభాగంలో మొదట టాస్ గెలిచిన సర్ సీఆర్ రెడ్డి (ఏలూరు) కాలేజీ టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి (గుంటూరు) కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ నందు 21 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్స్)తో రాణించాడు. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్‌రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సర్ సీఆర్‌రెడ్డి కాలేజీ బౌలర్ కే గణేష్ 3 వికెట్లతో మెరిశాడు. బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయి చరణ్ 36 పరుగులు (4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

జూనియర్స్ రీజనల్ విజేత ఎన్ఆర్ఐ

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ) విజేతగా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్స్) దుమ్మురేపాడు. అనంతరం 94 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ బ్యాట్స్‌మెన్, కెప్టెన్ కే సాయిచరణ్ 18 పరుగుల (2 ఫోర్లు)తో రాణించాడు. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నలుగురు బౌలర్లు జాఫర్, ప్రకాష్, తేజదీప్, రేవంత్ చెరో 2 వికెట్లు తీసి సమష్టి కృషితో విజయంలో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

సీనియర్స్ రీజనల్ విజేత సర్ సీఆర్ రెడ్డి

సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ (ఏలూరు) రీజనల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ (నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సర్ సీఆర్‌రెడ్డి టీమ్‌లో నాగవెంకట తేజ 32 (3 ఫోర్లు) పరుగులతో రాణించారు. బౌలర్లు హేమంత్, ఉమేష్, మధు ఒక్కొక్కరు రెండు వికెట్లు తీశారు. 32 పరుగుల చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అనంతరం 96 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ బౌలర్లలో మనోజ్, అమర్‌నాథ్ చెరో రెండు వికెట్లతో రాణించారు.



ట్రోఫీని అందుకుంటున్న విన్నర్స్ సీనియర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు



ట్రోఫీని అందుకుంటున్న రన్నర్స్ సీనియర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

- సీనియర్స్ విభాగంలో సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి), ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం) మధ్య..
- జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ (విశాఖపట్నం), ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్ (విజయవాడ) మధ్య..
- సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు), సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి) మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి.

ఇద్దరు దోపిడీ దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఇద్దరు దోపిడీ దొంగలను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. ఏసీనగర్ పాతపోస్టాఫీస్ వీధిలో విశ్రాంత ప్రభుత్వ టీచర్ గట్టుపల్లి హేమలత ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈనెల 16వ తేదీన ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి ఆమె నుంచి 8 సవర్ల బంగారు గాజులు, సరుడు, కమ్మలు దోచుకెళ్లారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై సుమన్, స్థానిక క్రైమ్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులు పాతనేరస్తులైన ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేట పంచాయతీ పాగావారిపాళెనికి చెందిన మనుబోలు అభిషేక్, నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేట లక్ష్మీగణపతివారివీధికి చెందిన ఎల్.రాంబాబుగా గుర్తించారు. బుధవారం నిందితులను ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకుని 8 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అభిషేక్ కారు డ్రైవింగ్‌తోపాటు వివిధ పనులు చేసేవాడు. రాంబాబు ఆటో నడుపుతుంటాడు. ఇద్దరూ స్నేహితులయ్యారు. వ్యసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో దొంగలుగా మారారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

గొంతు కోసి.. కడతేర్చి

- నెల్లూరులో యువకుడి దారుణ హత్య
- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల అనుమానం
- పరారీలో నిందితుడు

నెల్లూరు(క్రైమ్): ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నిందితులు కిరాతకంగా గొంతు కోశారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరులోని తల్పగిరికాలనీలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పొదలకూరు గ్రామం రామమందిరం వీధికి చెందిన రావుల అనుదీప్ (30)కు పావనితో 2019లో వివాహమైంది. వారికి అన్షిక అనే కుమార్తె ఉంది. అనుదీప్ డిప్లొమా వరకు చదివి ప్రస్తుతం వెంకటాచలంలోని సీఆర్సీ కళాశాలలో స్పెషల్ ఎయిడ్ అనే మానసిక వికలాంగులకు సంబంధించిన కోర్సు చేస్తున్నాడు. అతని తల్లి విజయలక్ష్మి సైదాపురం ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఏడునెలల క్రితం నుంచి అనుదీప్ కుటుంబం బుజబుజనెల్లూరులో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటోంది. అతను రోజు జిమ్‌కు వెళ్లి అనంతరం కళాశాలకు వెళ్లేవాడు. బుధవారం తెల్లవారుజామున సుమారు 2.45 గంటల సమయంలో అనుదీప్ స్నేహితుడైన పొదలకూరుకు చెందిన సురేష్ కాల్ చేసి తాను నెల్లూరుకు వస్తున్నానని రైల్వేస్టేషన్‌లో డ్రాప్ చేయాలని కోరాడు. ఈ విషయాన్ని అనుదీప్ తన భార్యకు చెప్పి మూడు గంటలకు ఇంట్లోంచి బయటకొచ్చాడు. తర్వాత ఏం జరిగిందో కానీ తల్పగిరికాలనీలో ఖాళీ ప్లాట్ల వద్ద అతను దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు గొంతు కోయడంతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ రోడ్డుపక్కనే ఉన్న కాలువ సమీపంలో మృతిచెందాడు.

ఫోన్ స్విచ్ఛాఫ్

ఉదయం ఆరు గంటలైనా అనుదీప్ ఇంటికి రాలేదు. దీంతో పావని భర్తకు కాల్ చేసినా లిఫ్ట్ చేయలేదు. మళ్లీ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తల్లి కూడా ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో అతను జిమ్‌కు వెళ్లి ఉంటాడని తల్లి, భార్య భావించి మిన్నకుండిపోయారు. తల్పగిరికాలనీలో యువకుడు దారుణహత్యకు గురైన విషయంపై స్థానికుల ద్వారా వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ నరసింహారావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.


అనుదీప్ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరసింహారావు

పోలీసులకు ఫోన్ చేయగా..

ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పావని భర్త ఫోన్‌కు కాల్ చేయగా పోలీసులు లిఫ్ట్ చేసి అనుదీప్ హత్యకు గురయ్యాడని తల్పగిరికాలనీలోని ఖాళీ ప్లాట్ల వద్ద మృతదేహం ఉందని చెప్పడంతో ఆమె అక్కడికి వెళ్లింది. సురేష్ తన భర్తను బయటకు తీసుకెళ్లాడని ఆయన లేదా ఇతరులు ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సురేష్ మరికొందరితో కలిసి ఈ హత్య చేశాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా పుటేజీని సేకరించారు. తెల్లవారుజామున 3.23 గంటల ప్రాంతంలో అనుదీప్ ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతూ మృతిచెందిన దృశ్యాలు రికార్డయ్యాయి. సుమారు రెండు నిమిషాలపాటు అతను నరకయాతన అనుభవించి చనిపోయాడు.

ఎవరీ సురేష్?

అనుదీప్ కుటుంబం పొదలకూరులో ఉంటున్న సమయంలో సమీపంలో సురేష్ కుటుంబం నివాసం ఉండేది. రెండు కుటుంబాలు ఎంతో స్నేహంగా ఉండేవి. అయితే వారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో అనుదీప్ కుటుంబం నెల్లూరుకు మకాం మార్చినట్లు సమాచారం. కొద్దిరోజులుగా సురేష్ కుటుంబంలో ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో అతనే ఈ కిరాతకానికి ఒడిగట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు సంబంధించి నెల్లూరు జిల్లాలో అధ్యక్షులను పార్టీ అధిష్టానం బుధవారం నియమించింది. వీరంతా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు అనుబంధ విభాగాల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. యూత్ వింగ్‌కు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి (నెల్లూరు రూరల్), మహిళా విభాగానికి మొయిళ్ల గౌరి (నెల్లూరు రూరల్), రైతు విభాగానికి సురా శ్రీనివాసులురెడ్డి (కోవూరు), బీసీ సెల్‌కు జాజుల కోటేశ్వరరావు (కందుకూరు), ఎస్సీ సెల్‌కు పందటి కామరాజు (కావలి), ఎస్టీ సెల్‌కు పాలకుర్తి రవి (నెల్లూరు రూరల్), మైనార్టీ సెల్‌కు షేక్ సిద్ధిఖీ (నెల్లూరు సిటీ), వైఎస్సార్ సేవాదళ్‌కు పీర్ల పార్థసారథి (ఆత్మకూరు), వీవర్స్ వింగ్‌కు మన్నెం సుధాకర్ (కోవూరు), క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు లక్కు స్వరాజ్ (సర్వేపల్లి), స్టూడెంట్ విభాగానికి శ్రావణ్‌కుమార్ (నెల్లూరు సిటీ), పంచాయతీరాజ్ వింగ్‌కు బి.అనిల్‌కుమార్‌రెడ్డి (వెంకటగిరి), వాణిజ్య విభాగానికి కె.వెంకటనారాయణ (కావలి), పబ్లిసిటీ వింగ్‌కు పాలవెల్లి మాలకొండారెడ్డి (ఉదయగిరి), వైఎస్సార్‌టీయూసీకి నడవడి ముత్యంగౌడ్ (సర్వేపల్లి), కల్చరల్ వింగ్‌కు నారాయణబాబు (నెల్లూరు సిటీ), ఐటీ వింగ్‌కు కె.వెంకటేశ్వర్లు (ఆత్మకూరు), దివ్యాంగుల విభాగానికి బి.పోలయ్య (సర్వేపల్లి), గ్రీవెన్స్ సెల్‌కు టి.సురేంద్రబాబు (సర్వేపల్లి), డాక్టర్స్ వింగ్‌కు డాక్టర్ డి.మహేంద్రనాథ్‌రెడ్డి (నెల్లూరు సిటీ) నియమితులయ్యారు.



రైలు ఢీకొని వ్యక్తి మృతి

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు సమీపంలోని మూలకట్ట వద్ద మంగళవారం రాత్రి రైలు ఢీకొని చంద్రకిరణ్ (36) అనే వ్యక్తి మృతిచెందాడు. 142/20-22 పోల్ వద్ద బుధవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన ముద్దపాటి రాధయ్య, సుజాతమ్మ కుమారుడైన చంద్రకిరణ్‌గా గుర్తించారు. అతను 108 అంబులెన్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు ఢీకొని చనిపోయాడా? అనేది తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు వెల్లడించారు.


చంద్రకిరణ్ (ఫైల్)